క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

వేటపాలెం: పందిళ్లపల్లిలోని గంగా పార్వతి సమేత పునుగు రామలింగేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణంలోని కల్యాణ మండపంలో మణికంఠ సేవా సమితి సహకారంతో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గుంటూరు నీరజ న్యూరో కేర్ వైద్యశాల డాక్టర్ కోటి నీరజ, సీతారం, గాయిత్రిలు 300 మందికి పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మేనేజర్ ప్రవీణ్, మణికంఠ సేవా సమితి సభ్యులు పోలకం శేఖర్, గుమ్మడి సుశీల పాల్గొన్నారు.

నేడు యద్దనపూడిలో స్పందన

యద్దనపూడి: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్పందన కార్యక్రమాన్ని సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు వెంకటరెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించే స్పందన కార్యక్రమానికి అన్ని గ్రామాల ప్రజలు తమ సమస్యలకు సంబంధించి అర్జీలు అందజేసి పరిష్కరించుకోవచ్చన్నారు. అన్ని శాఖల అధికారులు స్పందన కార్యక్రమానికి హాజరు కావాలని లేని పక్షంలో శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

రేపు మార్టూరు మండల సమావేశం

మార్టూరు: మార్టూరు మండల సర్వ సభ్య సమావేశం 14 వతేదీ మంగళవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జీ నితిన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశం భవనం నందు ఎంపీపీ భూక్యా శాంతిబాయి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

కొప్పరపాడుకు నూతన పీహెచ్‌సీ మంజూరు

బల్లికురవ: మండలంలోని కొప్పరపాడు గ్రామానికి ప్రభుత్వం నూతనంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంజూరు చేసిందని గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి రమీజ్ అహ్మద్ ఆదివారం తెలిపారు. ప్రస్తుతం మండలంలోని 20 సచివాలయాలతో పాటు, మార్టూరు మండలంలోని వలపర్ల ఒకటి, రెండు సచివాలయాలు కూడా గుంటుపల్లి పీహెచ్‌సీ పరిధిలోనే ఉన్నాయన్నారు. ప్రజలకు అందుబాటులో వైద్యం అనే విధంగా కొప్పరపాడు పీహెచ్‌సీని మంజూరు చేశారని చెప్పారు. అత్యవసర చికిత్స అందించనున్నట్లు వైద్యాధికారి చెప్పారు.

ఆధ్యాత్మిక చింతన అలవరచుకోవాలి

చీరాల రూరల్: చిన్నారులకు చిన్ననాటి నుంచి చదువుతో పాటు ఆధ్యాత్మిక చింతన అలవరచుకున్నట్లయితే మంచి పౌరులుగా ఎదుగుతారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక జాన్‌పేటలోని సెయింట్ జాన్స్ ప్యారిష్ చర్చిలో సండే స్కూలు చిన్నారులకు చిల్డ్రన్స్ రిట్రీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు బైబిల్ గ్రంథంలోని అంశాలను క్రోడీకరించి క్విజ్ పోటీలు, దేవుని గీతాలాపన పోటీలు నిర్వహించారు. విజేతలైన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ముందుగా సంఘ కాపరి రెవరెండ్ గోదా చంద్రకాంత్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి దేవుడి వాక్య సందేశాలు అందించారు. చిన్నారులను క్రమం తప్పకుండా ప్రతి ఆదివారం చర్చిలో జరిగే సండేస్కూలు కార్యక్రమాలకు పంపించి దేవుని సన్నిధిలో మంచి పౌరులుగా ఎదిగేలా పెద్దలు, తల్లిదండ్రులు కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సండేస్కూలు ప్రతినిధులు, టీచర్లు, చిన్నారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసం పోరాటం

అద్దంకి: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేస్తామని యూటీఎఫ్ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. స్థానిక శ్రీనివాసా కళ్యాణమండపంలో ఆదివారం బాపట్ల జిల్లా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. దీనిలో భాగంగా సంఘ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసరావు జెండా ఆవిష్కరించి వందనం చేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి ఏ శ్రీనివాసరావు, పీ హరిబాబు, ఆడిట్ కమిటీ కన్వీనర్ బాబూరావు, అద్దంకి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి ఈ రామారావు, బీ పూర్ణచంద్రరావు, నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి వరిగడ్డి దగ్ధం

చీరాల అర్బన్: విద్యుత్ తీగలు తగలడంతో ట్రాక్టర్‌పై ఉన్న వరిగడ్డి దగ్ధమైన ఘటన ఆదివారం సంపత్‌నగర్ వద్ద చోటుచేసుకుంది. సుమారు మూడు ఎకరాల వరిగడ్డిని ఆదివారం తీసుకెళ్తుండగా సంపత్‌నగర్ కాలనీ వద్ద విద్యుత్ తీగలు వరిగడ్డికి తగలడంతో నిప్పురవ్వలు చెలరేగి మంటలు వ్యాపించాయి. వెంటనే గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వారు అక్కడకు చేరుకొని మంటలను పూర్తిగా అదుపు చేశారు. ప్రమాదంలో వరిగడ్డి పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదంలో రూ.25 వేలు నష్టం వాటిల్లించగా ఈ మేరకు వివరాలు నమోదు చేసుకున్నారు.

వాడవాడలా ఆధ్యాత్మిక శోభ


ప్రత్యేక అలంకరణలో కోట సత్యమాంబదేవి


ప్రత్యేక అలంకారంలో పోలేరమ్మ అమ్మవారు


అలంకరించిన గుంటి గంగా భవాని అమ్మవారు


స్వామివారి కళ్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేపీ

ఎమ్మెల్యే, జంకె పూజలు

తర్లుపాడు: వేణుగోపాలస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం స్వామి వారిని ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు జంకె వెంకటరెడ్డిలు సందర్శించి పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్ వారికి తీర్థప్రసాదాలు అందించి స్వామివారి శేష వస్త్రాలను బహూకరించి సన్మానించారు. కాగా ఉత్సవాల్లో భాగంగా సమీప గ్రామాల వారు స్వామివారిని దర్శించుకోని పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, సర్పంచ్‌లు పి. వరాలు, రమణారెడ్డి, రామిరెడ్డి, ఎంపీటీసీలు అంకమ్మ, పార్వతి రమేష్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు అక్బర్ అలీ, వైస్ సర్పంచ్ వెన్నా సత్యనారాయణరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు. జంకె వెంకటరెడ్డి వెంట మాజీ ఎంపీపీ గాయం శ్రీనివాసరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ కొండయ్య, మహేశ్వరరెడ్డి తదితరులున్నారు.

గుంటి గంగా భవానికి ప్రత్యేక పూజలు

తాళ్లూరు: జిల్లాలో ప్రసిద్ధి చెందిన గుంటి గంగా భవాని అమ్మవారికి ఆదివాకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పూజారులు విజయలక్ష్మి, ప్రకాశరావు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ఆరు చీరలు బహూకరించారు. ఆలయానికి రూ. 9,213 ఆదాయం వచ్చినట్లు ఆర్‌ఏ శ్రీనివాసరావు తెలిపారు. సౌకర్యాలను ఆలయ చైర్మన్ కటకంశెట్టి శ్రీనివాసరావు, ఈఓ భాస్కర్ రెడ్డి, ఆలయ అధికారి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

వైభవంగా నిర్మమహేశ్వరుని బ్రహ్మోత్సవాలు

పొదిలి రూరల్: మహాశివరాత్రి పురస్కరించుకొని పొదిలిలో పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. రెండో రోజు ఆదివారం గంగావతరణ అలంకారములో స్వామివారు భక్తులకు దర్శనం ఇచ్చాడు. ఉదయం ఫిగిలికొట్టు ఉత్సవంతో మొదలై స్వామి వారికి పండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పార్వతీ పరమేశ్వరిని ఉత్సవ మూర్తులను పూలతో ప్రత్యేక అలంకరణచేసి పొదిలి పురవీధుల్లో ఊరేగాడు. ఉభయదాతలు పరుచూరి వెంకట సత్యనారాయణ, కొండా సుబ్రహ్మణ్యం, వెంకట లక్ష్మీనారాయణ, తాతా వెంకటేశ్వరరావు, ప్రత్యేక పూజలు చేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం నైవేద్యాలు చెల్లించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా మల్లికార్జునస్వామి కళ్యాణం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శివాలయంలో భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆదివారం శివస్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కళ్యాణానికి భక్తులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. తొలుత స్వామివార్ల మూలవిరాట్లను స్వర్ణ, రజత ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అర్చకుల వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ కళ్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించిన ప్రత్యేక వాహనంపై స్వామి, అమ్మవారి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

14 నుంచి విగ్రహ ప్రతిష్ఠ

బేస్తవారిపేట: మండలంలోని మోక్షగుండంలో శ్రీ చక్ర సహిత యోగ శక్తి అమ్మవారి, విఘ్నేశ్వర, సుబ్రమణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఈనెల 14 నుంచి 16 వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేద పండితుల ఆధ్వర్యంలో 14న గణపతిపూజ, పుణ్యాహవచనము, పంచగవ్యప్రోక్షణ, యాగశాల ప్రవేశం, హోమాలు, 15న ప్రతిష్ఠామూర్తులకు అభిషేకాలు, గ్రామోత్సవం, సామూహిక చండీహోమం, ధాన్యాధివాసం 16న విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, మంగళహారతి పూజలు జరుగుతాయన్నారు.

కేదారేశ్వర స్వామిని దర్శించుకున్న న్యాయమూర్తి

తర్లుపాడు: మండలంలోని కేతగుడిపి గ్రామంలో వెలసిన శ్రీ గంగాపార్వతి సమేత కేదారేశ్వర స్వామి వారిని మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జి యస్. రమేష్ నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి దర్శించారు. స్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. సర్పంచ్ పెద్దమస్తాన్, కమిటీ సభ్యులు పిచ్చయ్య, స్కూల్ కమిటీ చైర్మన్ రమేష్ వారిని శాలువాతో సత్కరించారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణ శివారులో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలను అర్చకులు ఘనంగా నిర్వహించారు. పోలేరమ్మ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రసిద్ధి చెందింది. ఆలయ అర్చకులు వెంకటేశ్వర్లు అమ్మవారికి ప్రత్యేక అలంకారాలు చేసి కుంకుమార్చన, అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ పరిధిలో ఉన్న నాగమయ్య పుట్టకు, నాగమయ్య శిలలకు ప్రత్యేక పూజలను భక్తులు నిర్వహించారు. ఆలయ ఈవో చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ బాసానీ శ్రీనివాసులు, ధర్మకర్తలు, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి, తదితరులు పర్యవేక్షించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

గిద్దలూరు రూరల్: మడియాలేశ్వర స్వామి ఆలయ మూడో వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రాచర్ల గేటు వద్ద నుంచి బోనాలతో పెద్ద బజారు, ఐదో వార్డు, కొంగలవీడు రోడ్డు మీదుగా ఆలయం వరకు గ్రామోత్సావం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల కోటా సత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లె గ్రామాల్లోని పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కోటా సత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారికి అర్చనలు, సహస్ర నామ పూజలు, కుంకుమపూజలు, అఖండహారతి పూజలు చేశారు

తర్లుపాడులో నేడు రథోత్సవం

తర్లుపాడు: మండల కేంద్రం తర్లుపాడులో సోమవారం సాయంత్రం 4 గంటలకు రథోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి రథంపై ఊరేగించనున్నారు. సుమారు 20 నుంచి 30 వేల వరకు భక్తులు హాజరుకానున్నట్లు అంచనా. సోమవారం భక్తులకు అన్నదానం చేయనున్నారు. కాగా ఎస్‌ఐ ముక్కంటి ఆధ్వర్యంలో పొదిలి సీఐ సుధాకర్‌రావు పర్యవేక్షణలో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి హాజరు కానున్నారు.

శ్రీశైలం ముఖద్వారం ముస్తాబు

పెద్దదోర్నాల: శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో మండల కేంద్రం పెద్దదోర్నాలలో నిర్మించిన ముఖద్వారాన్ని మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రంగు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. శ్రీశైలం తరలివెళ్లే యాత్రికులు మండల కేంద్రం నుంచే ప్రయాణించాల్సి రావడంతో రద్దీ పెరిగింది. దీంతోపాటు శివరాత్రి బ్రహ్మోత్సవాలు మొదలు కావడంతో భక్తులు ఇప్పటి నుంచే శ్రీశైలం తరలివెళ్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీశైలం దేవస్థానం అధికారులు ఆర్చికి రంగులు వేయించడంతో పాటు విద్యుద్దీపాలతో ముస్తాబు చేయించారు.


జంకెను సన్మానిస్తున్న కమిటీ ప్రతినిధులు


విద్యుత్ దీపాలంకరణలో శ్రీశైలం ముఖ ద్వారం


జడ్జికి స్వాగతం పలుకుతున్న సర్పంచ్, ఆలయ కమిటీ సభ్యులు


ప్రత్యేక అలంకరణలో పార్వతీ పరమేశ్వర ఉత్సవ మూర్తులు

వలంటీర్ మృతికి సంతాపం


కుటుంబ సభ్యులకు సంతాపం తెలుపుతున్న ఎమ్మెల్యే కేపీ

మార్కాపురం: పట్టణ పరిధిలో 8వ సచివాలయ వలంటీర్ షేక్ జీనతున్నిషా బేగం (28) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి వారి ఇంటి వద్దకు వెళ్ళి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. బుర్రి కాటమయ్య, షేక్ ఉస్మాన్, కౌన్సిలర్ షక్షావలీ, కరీముల్లా, జోష్ హరి తదితరులున్నారు.

కృత్రిమ అవయవాల పంపిణీ వాయిదా

మార్కాపురం టౌన్: ఈ నెల 16న ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పంపిణీ చేయాల్సిన కృత్రిమ అవయవాల కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు దొంతిరెడ్డి గోపాల్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని అనివార్య కారణాల వల్ల అవయవాలు తయారు చేసే సంస్థ వారు రాకపోవడంతో కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు తెలిపారు. పంపిణీ చేసే తేదీ త్వరలో ప్రకటిస్తామని, దివ్యాంగులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

గురుకుల పాఠశాలకు ఇన్వర్టర్ అందజేత


ఇన్వర్టర్ అందజేస్తున్న వెంకటేశ్వరరెడ్డి

కంభం: పట్టణానికి చెందిన కుందా ప్రదీప్ బాబు, ఐఆర్‌యస్ తన తండ్రి భాస్కర్ బాబు జ్ఞాపకార్థం స్థానిక అంబేడ్కర్ గురుకుల పాఠశాలకు రూ. 25 వేల విలువచేసే ఇన్వర్టర్, బ్యాటరీ, ఇతర సామగ్రి అందించారు. పాఠశాలలో కరెంటు పోయిన సమయంలో స్టడీలో విద్యార్థినులు ఇబ్బంది పడుతున్న విషయాన్ని చిలకల వెంకటేశ్వరరెడ్డి కుందా ప్రదీప్‌కు తెలియజేయగా స్పందించిన ఆయన తనవంతు సహాయం అందించారు. ఆదివారం కళాశాల ప్రిన్సిపాల్ చాముండేశ్వరికి వెంకటేశ్వరరెడ్డి బ్యాటరీ, ఇతర సామగ్రి ఇచ్చారు.

ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో మోడల్ టెస్ట్



పరీక్ష పత్రాన్ని ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు

మార్కాపురం: మండలోలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్, యస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజ్ఞావికాసం మోడల్ టెస్ట్‌ను నిర్వహించారు. పరీక్ష పత్రాలను యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీరాములు, కె. ప్రభాకర్, పి. వెంకటేశ్వర్లు, యస్ఎఫ్ఐ నాయకులు లోకేష్ జోనాథన్ ఆవిష్కరించారు. త్వరలో జరగబోయే పదో తరగతి విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వారిని మానసికంగా సిద్ధం చేయడంతో పాటు భయాన్ని పోగొట్టేందుకు మోడల్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నామన్నారు. మొత్తం 800మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు. ఏనుగు రవికుమార్, రామాంజీ, కార్తీక్, కిరణ్, షారుక్, శివ తదితరులు పాల్గొన్నారు.

కులం పేరుతో దూషించిన వ్యక్తిని అరెస్ట్ చేయాలి


మాట్లాడుతున్న ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు వెంగళరావు

చినగంజాం: మహిళలను కులం పేరుతో దూషించి చంపుతామని బెదిరించిన వ్యక్తిని వెంటనే పోలీసులు అరెస్ట్ చేయాలని దళిత గిరిజన సంఘాల ఐక్యవేదిక జాతీయ అధ్యక్షుడు చప్పిడి వెంగళరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండల భవన సముదాయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని చినగంజాం గ్రామం ఎస్సీ కాలనీలో నివాసముంటున్న కట్టా శ్రీనివాసరావుకు ప్రభుత్వం 4.50 ఎకరాల భూమిని ఇచ్చారని, ఆ భూమిలో మామిడి, జామాయిల్ సాగు చేసుకుంటూ జీవిస్తున్నాడు. అతని భూమిపై కన్నేసిన కడవకుదురు గ్రామానికి చెందిన గున్నమనేని ప్రతాప్‌కుమార్, మరో నలుగురు వ్యక్తులకు డబ్బులిచ్చి మద్యం పోయించి ప్రలోభానికి గురిచేసి అడ్డుకునే ప్రయత్నం చేశారన్నారు. ఆ భూమి తన పూర్వీకులదని వారిని ఆ భూమిలో అడ్డుకుంటే కొంత డబ్బు ఇస్తానని వారికి ఆశ చూపి మొక్కలను నరుకుతుండగా సమాచారం తెలుసుకున్న శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. వారిని ప్రతాప్ కుమార్ కులం పేరుతో దూషించి మహిళలు అని కూడ చూడకుండా వారిపై దాడి చేసి చంపుతామని బెదిరించిన ప్రతాప్‌కుమార్ అతని అనుచరులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రకాశం జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ సభ్యుడు జగన్నాథం రామారావు, దళిత హక్కుల సాధన సమితి అధ్యక్షుడు ముప్పవరపు గోపి, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

40 శాతం రాయితీపై యాంత్రీకరణ యూనిట్లు

బల్లికురవ: రైతుల గ్రూపులకు నలభై శాతం రాయితీపై యాంత్రీకరణ యూనిట్లు అందజేసేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యవసాయాధికారిణ ఎస్‌వీపీ కుమారి ఆదివారం తెలిపారు. ఒక్కో గ్రూపునకు రూ.15 లక్షల వరకు పరికరాలు అందజేయనున్నట్లు చెప్పారు. ఇందులో రైతు వాటాగా 10 శాతం చెల్లిస్తే, 40 శాతం రాయితీ, 50 శాతం బ్యాంక్ లోన్‌తో దఫాల వారీగా చెల్లించవచ్చని చెప్పారు. మండలంలోని 20 ఆర్బీకేల్లో 13 ఆర్బీకేల పరిధిలో యాంత్రీకరణ యూనిట్లను ఇప్పటికే అందించామన్నారు. బల్లికురవ, నక్కబొక్కలపాడు, కొణిదెన, అంబడిపూడి, వైదన, కొప్పరపాడు, వెలమవారిపాలెం గ్రామాల్లోని రైతు గ్రూపులు యాంత్రీకరణ యూనిట్లకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

అంగన్‌వాడీ భవనం పూర్తి చేయాలి

ముండ్లమూరు: అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు పాలెపోగు డగ్లస్, ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి, జెడ్పీటీసీ తాతపూడి రత్నరాజులను ఆయన కోరారు. స్థానిక ఎస్సీ కాలనీలో గత ప్రభుత్వ హయాంలో నిధులు కేటాయించగా నిర్మాణం పూర్తి కాలేదన్నారు. శ్లాబ్ వరకు వేసి కాంట్రాక్టర్ వదిలేసినట్లు తెలిపారు. దీంతో కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం అసంపూర్తి భవనంలోనే కొనసాగుతోందన్నారు. కనీసం తులుపులు కూడా లేవన్నారు. ప్లాస్టింగ్ చేయకపోవడంతో పెచ్చులూడుతూ ఇబ్బంది కరంగా ఉందని తెలిపారు. దీంతో చిన్నారులను కేంద్రానికి పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. నిర్మాణం పూర్తి చేసి చిన్నారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని కోరారు.

సర్వసభ్య సమావేశం వాయిదా

ముండ్లమూరు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీపీ సుంకర సునీతా బ్రహ్మారెడ్డి తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశపు హాలులో ఆదివారం సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఎంపీటీసీ సభ్యులు హాజరు కాగానే ఎంపీపీ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మార్చి 16వ తేదీ తర్వాత తదుపరి సమావేశం నిర్వహించే తేదీ ప్రకటిస్తామని తెలిపారు.

సచివాలయ కన్వీనర్ ఈశ్వరయ్య మృతి


ఈశ్వరయ్య మృతదేహానికి నివాళులర్పిస్తున్న పార్టీ కన్వీనర్ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ చలమారెడ్డి, నాయకులు

పెద్దారవీడు: మండలంలోని తంగిరాలపల్లె పంచాయతీ తమ్మడపల్లె గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు, సచివాలయ కన్వీనర్ పిన్నెబోయిన ఈశ్వరయ్య(38) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆదివారం ఉదయం ఆయన మృతదేహానికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి, జెడ్పీటీసీ ఏర్వ చలమారెడ్డి, సర్పంచులు తోకల మల్లేశ్వరి, ఆదినారాయణ, నాయకులు తోకల ఆవులయ్య, ఉప్పలపాటి పెద్దకాశయ్య, నరాల రామచంద్రుడు, తడికమళ్ల బాలసుబ్బారావు, ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

అద్దంకి: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో వారికి ఉపయోగకరమైన అట్టలు, జామెట్రీలు, పెన్సిల్స్, పెన్నులను రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ వారి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ఆదివారం పట్టణంలోని సాంఘీక సంక్షేమ శాఖ వసతి గృహంలోని 90 మంది విద్యార్థులకు పాత శివాలయం సమీపంలోని లక్ష్మయ్య సేవాసదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అడుసుమల్లి వెంకటేశ్వర్లు సౌజన్యతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా సాధికారిత అధికారి రాజదెబోరా, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ ప్లాక్లిన్, రోటరీ అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసరావు, కార్యదర్శి చిన్ని మురళీ కృష్ణ, కోశాధికారి తమ్మన శ్రీనివాసరావు, చప్పిడి వీరయ్య, రోటరీ సభ్యులు, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్ల నియామకం

పొదిలి రూరల్: మండలంలోని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కన్వీనర్‌గా కుంచేపల్లి గ్రామానికి చెందిన పేరం సుభాష్ చంద్రబోస్‌రెడ్డి నియమితులయ్యారు. కో–కన్వీనర్లుగా జువ్వలేరు గ్రామానికి చెందిన చల్లా వెంకటరామిరెడ్డి, ఈగలపాడుకు చెందిన పేరం సాయి కృష్ణారెడ్డి, తలమళ్ళకు చెందిన వి. రామ్‌ప్రసాదు, పిన్నిరెడ్డి మాధవరెడ్డిలను నియమించారు. అలాగే పొదిలి నగర పంచాయతీ సోషల్ మీడియా కన్వీనర్‌గా షేక్ రహమాన్, కో–కన్వీనర్లుగా పయ్యావుల మహేష్, మందగిరి రమేష్‌బాబు, వెలుగోలు కాశీ విశ్వనాథ్, ముల్లా జిందా బాషాలను నియమించారు. తమపై ఎంతో నమ్మకంతో పదవి ఇచ్చిన మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులురెడ్డి, సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, కసిరెడ్డి రమణారెడ్డి, గొలమారి చెన్నారెడ్డి, దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, నూర్జహాన్‌బేగం, గుజ్జుల రమణారెడ్డి, జి. శ్రీనివాసులుకు కృతజ్ఞతలు తెలిపారు. నియామక పత్రాలు అందినట్లు సుభాష్‌రెడ్డి తెలిపారు.

అదాని అక్రమాలపై విచారణ జరపాలి

మార్కాపురం టౌన్: అదాని అక్రమాలపై పార్లమెంట్ స్థాయి సంఘాన్ని ఏర్పాటు చేసి విచారణ జరపాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కన్వీనర్ వి. సుదర్శన్ ఓ ప్రకటనలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రధానికి సన్నితంగా ఉండి కోట్ల మంది భారతీయుల నమ్మకాన్ని ఒమ్ము చేశాడన్నారు. మదుపర్లు దాచుకున్న లక్షల కోట్ల రూపాయలకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రధాని నోరు విప్పాలన్నారు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే లక్షల కోట్ల రూపాయలకు అదాని అధిపతయ్యాడని విమర్శించారు.